

# ఆ-పన్నుల రాజ్యం

"తమరి బామ్మర్దులవారి లంచగొండి వ్యవహారాలను అదుపు చేయగల నిర్ణయం ప్రభువుల వారే తీసుకోవాలి–" అన్నాడు వినయంగా మంత్రి!

"పైసంపాదనకు అవకాశం లేనిచోట నియమించమని చెప్పానుగదా... అక్కడా లంచాలు మరిగాడా...?" ఆశ్చర్యంగా అడిగారు రాజుగారు.

"చిత్తం! తమ ఆజ్ఞ ప్రకారం ఊరి చివర ఓ గుడారం వేయించి, వచ్చిపోయే బళ్ళు లెక్కించే ఉద్యోగం ఇచ్చాం. కానీ, లెక్కబెట్టిన ప్రతి బండి దగ్గరా వరహా మామూలు వసూలు చేస్తున్నాడు ప్రభూ..." మొత్తుకున్నాడు మంత్రి.

ఈ సంగతేదో స్వయంగా తేల్చాలని మారువేషాల్లో బయల్దేరారు రాజూ, మంత్రీ...! కిరాయికి ఓ బండి మాట్లాడుకుని ఊరి చివరికొచ్చారు. బామ్మర్ది ఆ బండిని ఆపి, వరహా మామూలడిగాడు.

అప్పుడు బండివాడు బామ్మర్దుల వారికి వినయంగా నమస్కరించి "అయ్యా! సరుకు తయారయిన చోట తయారీపన్ను, దాన్ని అమ్మినందుకు అమ్మకం పన్ను, అమ్మడానికి తీసుకెళ్తున్నందుకు రహదారి పన్ను... ఇలా ఒకే వస్తువు మీద రకరకాల పన్నులు వడ్డిస్తూ, మధ్యలో మామూళ్ళు అంటారేందయ్యా...?" అడిగాడు.

మారువేషంలో బండిలో కూర్చున్న రాజుగారు మంత్రితో అన్నాడు గదా... "మంత్రీ! మావాణ్ని ఇక్కణ్ణించి తీసేసి ఇంకొకణ్ణి వేసినా వాడూ ఇదే పనిచేస్తాడు. ఈ అవినీతికి అంతం లేదా?"

మంత్రి దీర్ఘంగా నిట్టూర్చి, "అవినీతికి అంతం ఏముంది? ఒక అవినీతిని ఆపితే ఇంకో అవినీతి ఇంకో రూపంలో పుట్టుకొస్తుంది... దాన్ని కనీసం సగానికి తగ్గించగలిగితే, మనం గొప్ప పరిపాలకులం అయినట్టే" అన్నాడు.

రాజు దీర్ఘంగా ఆలోచించి, "వచ్చీపోయే బళ్ళ మీద వరహా పన్ను మనమే విధిద్దాం... అప్పుడు మా బామ్మర్ది అర్ధ వరహా లంచం ఇస్తే పన్ను అడక్కుండా వదిలేస్తానంటాడు. అలా వరహా అవినీతిని అర్ధవరహాకి తగ్గించగలిగినట్టే అవుతుంది కదా... అన్నాడు.

మంత్రికి బుర్ర తిరిగిపోయింది. "తమరి బామ్మర్దులవారు అంత తక్కువ వారు కాదు – వరహా పన్ను కట్టించుకున్నందుకు అర్ధవరహా లంచం అడుగుతాడు. అలా ఒకటిన్నర అవినీతిని పెంచిన వాళ్ళం అవుతాం..." అన్నాడు భయంగా!

"అవినీతిని నిర్మూలించాలనే ఆలోచనే వ్యర్థం" అనే నిర్ణయానికి వచ్చేశారు ఇంక రాజుగారు!! పన్నులు వసూలు చేసే అధికారుల గురించి అవినీతి నిరోధకశాఖ పట్టించుకోవడం మానేసింది అప్పట్నించి. ●

**'జీవి'తం కథలు**